సాక్షి
వనపర్తి
బుధవారం ౹ 8 ౹ ఫిబ్రవరి ౹ 2023



'డబుల్' వెలుగులు

గుడిసెలు, శిథిల ఇళ్లలో జీవిస్తున్న చెంచుల జీవితాల్లో 'డబుల్' వెలుగులు నిండనున్నాయి.

వివరాలు 8లో ►



మన్యంకొండలో ప్రభోత్సవం

మన్యంకొండ వేంకటేశ్వరస్వామికి సోమవారం రాత్రి ద్వితీయ ప్రభోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ►

గరిష్టం/కనిష్టం
33.0 /19.0

వాతావరణం

చలి తీవ్రత తగ్గుతుంది. రోజంతా ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

గడువులోగా పనులు పూర్తి



ఖిల్లాఘనపురం: మన ఊరు – మన బడి పథకంలో భాగంగా మొదటి విడత ఎంపిక చేసిన పాఠశాలల్లో గడువులోగా పనులు పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి కొండల్‌రావు కోరారు. మంగళవారం మండలంలోని మామిడిమాడ, ఖిల్లాఘనపురం గ్రామాల్లో ఎంపీడీఓ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మధ్యాహ్న భోజనం, కంటివెలుగు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని సర్పంచులు, ఏఈ సాయిరెడ్డికి సూచించారు. సుందరీకరణలో భాగంగా పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటాలన్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని చెప్పారు. కంటివెలుగు కేంద్రాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శానిటేషన్, ప్లాంటేషన్, నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, ఎంపీఓ రాజు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై విస్తృత ప్రచారం



పాన్‌గల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'కంటివెలుగు'పై ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది పరీక్షలు చేయించుకొనేలా చూడాలని కంటివెలుగు జిల్లా కార్యక్రమ అధికారి డా. సాయినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి పరీక్షలకు వచ్చే వారి పేర్లు నమోదు చేసిన రిజిస్టరు, కంటి పరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో 1,500 మందికి ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నాయని.. వీరందరూ కంటి పరీక్షలు చేయించుకొనేలా చూడాలని సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు డా. హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ సింధూజ పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు..

వీపనగండ్ల: కంటివెలుగులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందని కంటివెలుగు ప్రత్యేక అధికారి పుష్పలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల కోసం వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలుకరించి పరీక్షలు చేసి అందుబాటులో ఉన్న కంటి అద్దాలను పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. పరీక్షల కోసం వచ్చే వారి పేర్లను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. వంశీకృష్ణ, అదనపు వైద్యులు రాజశేఖర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,351

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగకు గరిష్టంగా రూ.8,351, కనిష్టంగా రూ.3,509 ధరలు లభించాయి., అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,261, కనిష్టంగా రూ.2,171, ఆర్‌ఎన్‌ఆర్ రకం రూ.2,421, ఉలువలు రూ.5,279, కందులు గరిష్టంగా రూ.7,029, కనిష్టంగా రూ.5,561, ఆముదాలు రూ.6,400, పెబ్బర్లు గరిష్టంగా రూ.5,910, కనిష్టంగా రూ.5,719 ధరలు లభించాయి.

పీయూలో ప్రాంగణ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ మేరకు హెటిరో సంస్థ ఆధ్వర్యంలో డ్రైవ్ నిర్వహించారు. 116 మంది విద్యార్థులు హాజరుకాగా.. 20 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినందించారు.

క్షేత్ర పర్యటనలకే ప్రాధాన్యం

- సమస్యల పరిష్కారం సరళతరం చేస్తా
- 'సాక్షి'తో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సాక్షి ముఖాముఖి

వనపర్తి: ప్రజలు ఆశించిన మేర పాలన అందేలా ప్రయత్నం చేస్తాం. అన్ని శాఖల పురోగతి, సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరుతున్న తీరును నేరుగా గ్రామాలకు వెళ్లి పరిశీలించి తెలుసుకొనే ప్రయత్నం చేస్తానని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం 'సాక్షి'తో పలు విషయాలు పంచుకున్నారు. రోజుకో శాఖపై సమీక్ష నిర్వహిస్తూ.. ఆ శాఖ పనితీరును తెలుసుంటూ.. చేయాల్సిన మార్పులు, ప్రజాభీష్టం మేరకు పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎలాంటి వారికి అలాగే సమాధానం ఇవ్వటం నాకు తెలుసు అంటూ తనదైన శైలిలో విద్య, వైద్యశాఖలో గతంలో చోటు చేసుకున్న పరిణామాలపై అడిగిన ప్రశ్నకు కలెక్టర్ బదులిచ్చారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి గాడిలో పెట్టే ప్రయత్నం చేద్దామన్నారు. 'సాక్షి' అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఆయన మాటల్లోనే..

పాఠశాలల్లో మెనూ పాటించాల్సిందే..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఇచ్చే ఆహారంలో మెనూ పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలిస్తా. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు ఉంటాయి. విద్యార్థులకు అందించాల్సిన ఆహారం విషయంలోనూ కక్కుర్తి పడితే సహించేది లేదు.

ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తా..

నా దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వయంగా తెలుసుకొనే ప్రయత్నం చేస్తా. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించను. బాలల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దే విద్యకు అధిక ప్రాధాన్యం ఉండాల్సిందే. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన మొదటివిడత మన ఊరు– మన బడి పథకం పనులు నెలరోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం.

పథకాల అమలులో..

ప్రభుత్వం అమలు చేసే పథకాలు, పనుల విషయంలో ఇతర జిల్లాలకు ఎక్కడా తీసిపోకుండా పని చేస్తా. అధికారులు, సిబ్బంది సహకారంతో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతా. అధికారులు, సిబ్బందికి కావాల్సిన స్వేచ్ఛ, సౌకర్యాలు కావాల్సిన మేరకు సమకూర్చుతా. పనిచేసే వారిని ప్రోత్సహించడంతో పాటు చేయని వారిపై చర్యలు అంతేస్థాయిలో ఉంటాయి. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలయ్యేలా దృష్టి సారిస్తా.

తన విద్యాభ్యాసం గురించి ప్రస్తావిస్తూ..

మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మలేగాస్ బ్లాక్ సొందానే అనే గ్రామంలో నా చదువు ప్రారంభమైంది. నాలుగో తరగతి వరకు అక్కడే చదువుకున్నా. పదేళ్ల వయసులో నవోదయ, సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు పక్కనే ఉన్న గ్రామానికి రోజు 5 నుంచి 6 కిలోమీటర్లు కాలినడకన వెళ్లేవాడిని. చివరకు సదారా సైనిక్‌స్కూల్‌లో సీటు సంపాదించా. అక్కడ నేర్పించిన డిఫెన్స్ కోర్సులు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు

వనపర్తి: ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్ 2, 3, 4 ఉద్యోగాల ప్రత్యేక శిక్షణ తరగతులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని వల్లభ్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ హాల్‌లో శిక్షణ తరగతులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో చదవాలని సూచించారు. అంతా తెలుసు అనే ధోరణి వదిలి నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి నుశిత తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు కొత్తకళ



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, చిత్రంలో ఎమ్మెల్యే ఆల

కొత్తకోట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త కళ వచ్చిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు, వంటగది, తాగునీటి కొళాయిలు, డ్యూయల్ డెస్క్ బెంచీలను ఎమ్మెల్యే, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, నాణ్యమైన బోధన అందుతుందని.. తల్లిదండ్రులు వారి పిల్లలను విధిగా చేర్పించాలని సూచించారు. విలువలతో కూడిన విద్య ప్రభుత్వ బడుల్లోనే దొరుకుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మండలంలోని రాయినిపేటలో ఎమ్మెలే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, సీసీ రోడ్డు, ఫంక్షన్‌హాల్, జములమ్మ ఆలయం దగ్గర కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కొత్తకోట సింగిల్‌విండో చైర్మన్ వంశీధర్‌రెడ్డి, రాయినిపేట సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు గాడీల ప్రశాంత్, అమ్మపల్లి బాలకృష్ణ, గోవిందు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న రైల్వే, మున్సిపల్ అధికారులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే గేట్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం కోసం మంగళవారం రైల్వే, మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం సమీపం వరకు ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అందుకు తగినట్లుగా కొలతలు వేశారు. రెండు రోజుల్లో ప్లాన్ సిద్ధం చేసి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మున్సిపల్ పాలకవర్గ ఆమోదం పొందిన తరువాత నిర్మాణం ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే శాఖ ఏజీఎం మూర్తి వెల్లడించారు. సర్వేలో కమిషనర్ మహమూద్ షేక్, సిబ్బంది పాల్గొన్నారు.

మచ్చల నివారణకు చర్యలు

రాష్ట్ర లెప్రసీ సర్వే యూనిట్ వైద్యాధికారి డా. సంతోషిలత



ఖిల్లాఘనపురంలో మచ్చలున్న వారిని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఖిల్లాఘనపురం: తెల్ల, నల్లమచ్చలను మందులు వాడి నివారించుకోవాలని రాష్ట్ర లెప్రసీ సర్వే యూనిట్ వైద్యాధికారి డా. సంతోషిలత తెలిపారు. మచ్చలున్న వారిని ఇటీవల ఆశా కార్యకర్తలు సర్వేచేసి గుర్తించారు. మంగళవారం వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పిలిపించి పరిశీలించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో మచ్చలున్న వారు 216 మంది ఉండగా ఆస్పత్రికి 80 మంది వచ్చారని చెప్పారు. వారందరిని పరిశీలించి తగిన మందులు ఇచ్చామని.. అవసరమైన వారికి ప్రత్యేక వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓలు నందీష్, కృష్ణా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ప్రవీణ్, పీహెచ్‌ఎం విమల, ఎంపీహెచ్‌ఓ నర్సింహులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర లెప్రసి సర్వే యూనిట్ తనిఖీ చేసింది. పీహెచ్‌సీ పరిధిలోని కుష్టు రోగులకు వైద్యం అందుతుందా? లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రతను అంచనా వేసి వైద్యం అందించాలని, అదే విధంగా మండలంలో కుష్టుతో బాధపడుతున్న వారికి రోజు వైద్యం అందించాలన్నారు. తరచూ వారికి ఆరోగ్య సూత్రాలు తెలియజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కుష్టు రోగుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యబృందం సభ్యులు సంతోషిలత, కృష్ణయ్య, నందీశ్వర్, పెద్దమందడి వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



అన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సమయంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. మంగళవారం పాన్‌గల్, అన్నారం, అన్నారంతండా, దావాజిపల్లి, గోప్లాపూర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు, తాగునీరు, రోడ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బస్ డిపో తదితర అభివృద్ధి పనులు చేపట్టి కొల్లాపూర్‌ను కోనసీమగా మార్చినట్లు వివరించారు. తన హయంలో రూ.300 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయిస్తే ఆయా పనులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే వైఖరిని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యకర్తలు అధైర్య పడకుండా సంఘటితంగా పనిచేస్తే ప్రజలు తప్పక ఆదరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, గోవర్ధన్‌సాగర్, భాస్కర్‌యాదవ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముందుకు.. వెనక్కు



మహబూబ్‌నగర్‌లోని జెడ్పీ మైదానంలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న పండిట్, పీఈటీలు

- గందరగోళంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ
- కోర్టు నిర్ణయంతో సీనియార్టీ జాబితా నిలిపేసిన విద్యాధికారులు
- రెండేళ్ల సర్వీస్ నిబంధన ఎత్తివేస్తూ రీషెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- 12 నుంచి మరోసారి దరఖాస్తుల స్వీకరణ
- మరోవైపు తమ డిమాండ్లు నెరవేర్చాలని పండిట్ల నిరసన

జిల్లాల వారీగా చేసుకున్న దరఖాస్తులు ఇలా..

జిల్లా	దరఖాస్తులు
మహబూబ్‌నగర్	1,751
జోగుళాంబ గద్వాల	1,285
నాగర్‌కర్నూల్	1,785
నారాయణపేట	1,060
వనపర్తి	1,212

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మూడు అడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్టు సాగుతుంది. ఇందులో భాగంగా గత నెల 30 నుంచి అర్హులైన ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,019 మంది ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో 317జీఓ ప్రకారం ఇతర జిల్లాలోకి బదిలీ అయిన వారు ప్రస్తుత బదిలీల్లో దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం రెండేళ్ల స్టేషన్ సర్వీస్ నిబంధనను ప్రభుత్వం విధించింది. దీంతో గతేడాది ఇతర జిల్లాలకు బదిలీ అయినవారు దరఖాస్తు చేసుకోలేదు. కొంతమంది కోర్టును ఆశ్రయించడం, కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తాజాగా బదిలీకి రెండేళ్ల సర్వీస్ నిబంధన లేకుండా అందరికీ మరోమారు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

దరఖాస్తులు పెరిగే అవకాశం..

గతంలో బదిలీ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7,019 దరఖాస్తులు రాగా.. ఇందులో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,785 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా.. అత్యల్పంగా నారాయణపేట నుంచి 1,060 దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో 317 ప్రకారం బదిలీ అయిన వారికి మరోమారు అవకాశం ఇస్తే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10వేల దరఖాస్తులు దాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారి జాబితాను విద్యాశాఖ అధికారులు సోమవారం సాయంత్రానికి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాల్సి ఉంది. కానీ, రాష్ట్ర విద్యాధికారుల సూచనతో జాబితా ప్రదర్శించలేదు. అయితే మరోమారు దరఖాస్తులు స్వీకరించాక.. అన్నీ కలిపి సీనియార్టీ జాబితా విడుదల చేయనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో కలిపి 2,500 వరకు ఖాళీలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,308 ఖాళీలు ఉన్నాయి.

బతుకమ్మ ఆడి నిరసన..

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే అప్‌గ్రేడ్ చేయాలన్న డిమాండ్‌తో పండిట్, పీఈటీలు నిరసన ఉధృతం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 3వేల వరకు పండిట్, పీఈటీలు విధులు నిర్వహిస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరనందుకు ఈ నెల 1 నుంచి 9, 10 తరగతులకు పాఠాలు చెప్పకుండా బహిష్కరిస్తున్నట్లు డీఈఓకు గతంలోనే వినతిపత్రం అందించారు. తాజాగా మంగళవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ మైదానంలో బతుకమ్మ ఆడుతూ తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తమ జాబ్ చార్టులో లేకపోయినా కొన్నేళ్లుగా 9, 10 తరగతులకు బోధించామని, ప్రభుత్వం హామీ ఇచ్చి అప్‌గ్రేడ్ చేయకపోవడం బాధాకరమన్నారు. కోర్టులో కేసులు ఉన్నందున తమను వినహాయించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం సరికాదని, తమకు కూడా న్యాయం చేయాలని కోరుతున్నారు.

అక్రమ బదిలీలతో బేజార్..

ఒకవైపు చాలామంది ఉపాధ్యాయులు జీఓ 317 పేరిట తమను అకారణంగా ఇతర జిల్లాలకు బదిలీ చేశారని, ఇందులో రెండేళ్ల సర్వీస్ ఉన్నవారికే ఉందని, అందరికీ న్యాయం చేయాలని కోర్టుల చుట్టూ తిరుగుతుంటే.. మరికొందరు అడ్డదారిలో నేరుగా ఆర్డర్లు తెచ్చుకుని డిస్ట్రిక్ట్, ఇంటర్ డిస్ట్రిక్ బదిలీలు చేసుకుంటున్నారు. కేవలం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో మొత్తం 12 బదిలీలు కాగా.. ఇంటర్ డిస్ట్రిక్ట్ 4 బదిలీలు అయినట్లు సమాచారం. ఇలా ఉమ్మడి జిల్లాలో 30 వరకు జరిగినట్లు తెలిసింది. అడ్డదారిలో బదిలీ కావడం వల్ల అధిక వయస్సు ఉన్నవారు, అనారోగ్య సమస్యలు, పీహెచ్‌సీలు ఇలా అనేక కారణాలతో పాయింట్లు పొంది ముందు వరుసలో ఉన్నవారికి అన్యాయం జరుగుతుందని, ఇకనైనా వాటిని ఆపి, చేసిన బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రీ షెడ్యూల్ ప్రకారం బదిలీలు

ప్రభుత్వం గతంలో ఇచ్చిన షెడ్యూల్‌ను రీషెడ్యూల్ ఇచ్చింది. దాని ప్రకారం బదిలీలు, పదోన్నతులు జరుగుతాయి. ఈ మేరకు ఈ నెల 12 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు వివిధ మేనేజ్‌మెంట్‌ల వారీగా బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉపాధ్యాయులు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చు. 16,17 తేదీల్లో సీనియార్టీ జాబితా డిస్‌ప్లే చేసి, అభ్యంతరాలు స్వీకరిస్తారు. 21, 22 తేదీల్లో ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రకటిస్తారు. అనంతరం బదిలీ, ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

– యాదయ్య, డీఈఓ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

వెలుగొమ్ములలో చోరీ



మిడ్జిల్: మండలంలోని వెలుగొమ్ములలో సోమవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలరాజుగౌడ్ ఇంటికి తాళం వేసి జడ్చర్లకు వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి రాగా.. తాళం పగులగొట్టి ఉంది. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ వచ్చి విచారణ చేపట్టారు. ఇంట్లో ఉన్న బీరువాలో 3 తులాల నాను, తులం పట్టీలు, అర తులం కమ్మలు కలిపి మొత్తం 4.5 తులాల బంగారు వస్తువులు, 30 తులాల వెండి వస్తువులు, రూ.95 వేల నగదు చోరీకి గురయ్యాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండా, మారేడుమాన్‌దిన్నెతండాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 150 కిలోల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు కొల్లాపూర్ సీఐ ఏడుకొండలు తెలిపారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రఘునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ రాజారవి, కానిస్టేబుళ్లు చిన్నయ్యగౌడ్, దస్తగిరి, పద్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

అచ్చంపేట రూరల్: మనస్తాపంతో యువతి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. యువతి మృతిపై తల్లి రామేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా.. అచ్చంపేట మండలం చౌటపల్లికి చెందిన కుర్మమ్మ(17) తల్లిదండ్రులు లేని సమయంలో ఈ నెల 6వ తేదీన సోమవారం అదే గ్రామానికి చెందిన యువకుడు ఎల్లికంటి కృష్ణయ్య ఇంట్లో దూరి బలవంతం చేయడంతో యువతి కేకలు వేసింది. దీంతో పరిసర ఇళ్ల వారు వచ్చి చూశారు. యువకుడు వెళ్లిపోగా, మనస్థాపానికి గురైన యువతి ఇంట్లో ఉన్న పరుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ యువతి మంగళవారం మృతిచెందింది. తమ కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు మనస్థాపంతో పురుగుల మందు తాగి మృతి చెందిందని యువతి తల్లి రామేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీబీపీఎల్ సీజన్-5 బ్రోచర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్లను హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నీ ఆర్గనైజర్లు మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జీబీపీఎల్ సీజన్-5 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీబీపీఎల్ క్రికెట్ టోర్నీ ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీని జీబీపీఎల్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆసక్తిగల జట్లు ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం చరణ్‌నాయక్ (9010322645), ఛత్రపతి (6301399507) నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు వి.హనుమాన్‌నాయక్, జీబీపీఎల్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు ఆర్.రవిరాథోడ్, రంగనాయక్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల జీవితాల్లో 'డబుల్' వెలుగులు

- ఇళ్లులేక గుడిసెల్లో అటవీప్రాంతాల్లో నివాసాలు
- పరిగి ఎమ్మెల్యే చొరవతో అధికారుల పరిశీలన
- చౌదర్‌పల్లి, చిన్నాయపల్లిలో 70 ఇళ్ల నిర్మాణాలకు త్వరలో చర్యలు



చిన్నాయపల్లిలో గుడిసెల్లో నివాసాలు ఉంటున్న చెంచులు



చౌదర్‌పల్లిలో ప్రమాదకర ఇళ్లల్లో చెంచుల నివాసాలు

మహమ్మదాబాద్: ఏళ్ల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెంచుల ఇళ్లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉండటంతో, మూడేళ్లక్రితం వాటిని కూల్చివేయడంతో ఇక వారు అటవీ ప్రాంతాలకు వెళ్లి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. దీంతో కొండలు, కోనలు, చెట్టుపుట్టలే వారి నివాసాలుగా మార్చుకున్నారు. అలాంటి తరుణంలో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి చొరవతో వారికి మళ్లీ ఇళ్లలో నివాసాలు ఉండేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ వెంకట్రావు ఉత్తర్వుల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఛత్రునాయక్ ద్వారా గృహనిర్మాణ శాఖ ఈఈకి ఇళ్లు నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు. పరిగి ఎమ్మెల్యే కోటా కింద రూ.5.04లక్షలతో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు నిర్ణయం తీసుకున్నారు.

మండలంలోని చిన్నాయపల్లి, చౌదర్‌పల్లి, ధర్మాపూర్‌లో దాదాపు 120కి పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. గతంలో వారికి నివాసాలు కరువవడంతో నాటి ప్రభుత్వం ఇందిరమ్మ పాలనలో వారికి సొంత ఇళ్లను కట్టించి ఇచ్చారు. దాదాపు అలాంటి ఇళ్లు నిర్మించి 60ఏళ్లు గడుస్తుండగా అవి కాస్త ప్రమాదవశాత్తు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో రెండు సంవత్సరాల క్రితం పరిశుభ్రం పేరున పాత ప్రమాదకర ఇళ్లను అధికారులు కూలిచ్చేశారు. అప్పటి నుంచి గుడిసెలు వేసుకుని దాదాపు 80 కుటుంబాలకు పైగా నివాసాలు ఏర్పరుచుకున్నారు. చిన్నాయపల్లిలో 64 కుటుంబాలు ఉండగా చౌదర్‌పల్లిలో 15 కుటుంబాల వరకు ఉన్నాయి. చౌదర్‌పల్లిలో ఇళ్ల మధ్యన వారు గుడిసెల్లో నివాసాలు ఉండలేక అటవీ ప్రాంతానికి వెళ్లారు. గుట్టపై గుడిసెల్లో నివాసాలు ఏర్పరుచుకుని ఉండగా, విషపురుగులు కరిచి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోగా గ్రామస్తులు, అధికారులు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి గ్రామంలోని గుడిసెల్లోకి తీసుకొచ్చారు.

త్వరగా ఇళ్లు నిర్మిస్తే బాగుండు..



ఇల్లు లేక నిత్యం అవస్థలు పడుతున్న సమయంలో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడం సంతోషకరం. గుడిసెల్లో ఉంటూ నిత్యం భయంతో బతుకుతున్నాము. వర్షాకాలం వచ్చేలోపు ఇళ్లు నిర్మించి ఇస్తే బాగుంటది. అధికారులు, ఎమ్మెల్యే వెంటనే నిర్ణయం తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టాలి.

– చెంచు గంగమ్మ, చిన్నాయపల్లి

అడవే ఆధారమైంది



పక్కా ఇళ్లు లేకపోవడంతో గ్రామాలను వదిలి అడవికి వెళ్లి అక్కడ గుట్టల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాము. తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక అడవే ఆధారమైంది. ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడంతో శుభపరిణామం. మేము కూడా గ్రామాల్లో ఉండాలంటే పక్కా ఇళ్లు ఉండాలి. చెంచుల జీవితాల్లో వెలుగు నిండాలంటే వారికి పక్కా ఇళ్లు త్వరగా నిర్మించి ఇవ్వాలి.

– చెంచు ఎల్లయ్య, చౌదర్‌పల్లి

త్వరలో డబుల్ బెడ్రూం ఇళ్లు

పక్కా ఇళ్లు లేక నిత్యం ఎన్నో అవస్థలు పడుతున్న చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేలా వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించాలన్న నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే చొరవతో కలెక్టర్ నిర్ణయం మేరకు త్వరలో ఇళ్లు నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవచ్చు. వచ్చే వర్షాకాలం లోపు వారికి ఇళ్లు ఇవ్వాలన్నదే అధికారుల నిర్ణయం.

– ఆంజనేయులు, తహసీల్దార్, మహమ్మదాబాద్

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన బీట్ ఆఫీసర్లు

జడ్చర్ల టౌన్: క్షేత్ర పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను మంగళవారం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ(హైదరాబాద్)లో శిక్షణ పొందుతున్న వారికి వృక్షశాస్త్రవిభాగ అధిపతి శ్రీనివాసులు, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య సాదర స్వాగతం పలికారు. గార్డెన్‌లో ఉన్న మొక్కలు, హెర్బేరియం గురించి అవగాహన కల్పించారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో పట్టుకున్న పాములను, వారికి చూపించి, వాటి గురించి వివరించారు. గార్డెన్ సందర్శన వల్ల తమక ఎన్నో విషయాలు తెలియడంతో పాటు అంతరించిపోతున్న మొక్కలను చూడగలిగామని ఆఫీసర్ల బృందం పర్యవేక్షణ అధికారి రాంమోహన్ వెల్లడించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



ధన్వాడ: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 7టిప్పర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా సూరారం వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా, ఎస్‌ఐ రమేష్ తెల్లవారు జామున కొండాపూర్ శివారులో టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాలెంలో పుణ్యక్షేత్రం లాంటి అనుభూతి



మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళా భక్తులు

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం పుణ్యక్షేత్రాన్ని దర్శించిన అనుభూతిని కలిగించిందని, ఇక్కడి స్వామి వారు తిరుమల తిరుపతి దేవస్థానం మూలవిరాట్‌కు తీసిపోదని అహోబిల పీఠాధిపతి 46వ జీయర్ శ్రీరంగనాథ యంతీంద్ర మహదేసికన్ స్వామి అన్నారు. మంగళవారం ఆయన ఈ దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతిని ఆలయ కమిటీ, మహిళా భక్తులు పూర్ణకుంభం, మంగళ హారతులతో స్వాగతం పలికి సన్మానించారు. ఆలయాన్ని కలియ తిరిగి తన దివ్యసందేశాన్ని భక్తులకు వినిపించారు. ఇలాంటి ఆలయాన్ని సందర్శించుకోవడం తన అదృష్టమన్నారు.

వరిసాగులో జాగ్రత్తలు అవసరం



వరిలో కాలిబాట

అలంపూర్: యాసంగిలో వరిపంట సాగు జాప్యం చేసిన రైతులు తగిన సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. అందుకు అనుగుణంగా పంట సాగు చేస్తే దిగుబడి సాధించవచ్చని పేర్కొంటున్నారు.

పొలం తయారీ..

నాట్లు వేయడానికి 2-3 సార్లు దమ్ము చేయాలి. ఆఖరి దమ్ములో ఒక ఎకరాకు 40 కిలో వేప పూత యూరియా, 200 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 35 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. చదరపు మీటర్‌కు 44 కుదుళ్లు ఉండేవిధంగా నాటాలి. నాట్ల తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలిబాటలు ఉండేలా చూసుకోవాలి. దీని వలన పైరుకు గాలి, వెలుతురు సమంగా అంది చీడపీడల ఉధృతి తగ్గుతుంది.

ఎరువుల యాజమాన్యం..

నాట్లు వేసిన 30 నుంచి 60రోజుల దశలో బురద పదును ఉన్న సమయంలో ఎకరాకు 30కిలోల వేప పూత యూరియా వేయాలి. దీని వల్ల పిలకలు ఎక్కువగా వచ్చి దుబ్బు బాగా కదుతోంది. తేలిక నేలల్లో అంకుర దశలో (నాటిన 60 రోజుల్లో) ఎకరాకు 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి.

నీటి యాజమాన్య పద్ధతులు..

పొలంలో వరి నాటే సమయంలో 2 సెం.మీ. మేరకు నీటి నిలువలు ఉండే విధంగా చూసుకోవాలి. నాట్ల అనంతరం 4-5 రోజుల వరకు 5 సెం.మీ. మేరకు నీరు ఉండే విధంగా చూసుకోవాలి. దీని వల్ల మొక్కలు త్వరగా వేరు తొడుగుతాయి. తర్వాత 2 సెం.మీ. మాత్రమే నీరు ఉంచాలి. ఆ సమయంలో నీరు ఎక్కువైతే పిలకలు తక్కువగా వస్తాయి. పంట పొట్ట దశ నుంచి గింజలు పాలుపోసుకోని గట్టిపడే వరకు 5 సెం.మీ. నీరు పెట్టాలి. పంట మధ్య కాలంలో అప్పుడప్పుడు నీరు తీసి పొలాన్ని ఆరబెట్టి తిరిగి నీరుపెట్టాలి. ఇలా చేయడం వల్ల పైరు ఆరోగ్యంగా ఉండి చీడపీడల బెడద తగ్గుతుంది.

కలుపు నివారణ..

నాట్లు వేసిన 3-5 రోజుల్లో ఎకరానికి 40 గ్రాముల ఆక్సాడయార్జిల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

సల్ఫైడ్ దుష్ప్రభావం..

పంట మధ్యకాలంలో పైరుకు అక్కడక్కడా కుదుళ్లు పసుపు రంగులోకి మారుతాయి. దీనినే సల్ఫైడ్ దుష్ప్రభావంగా పేర్కొంటారు. ఈ సమస్య ఉన్న పొలంలో నేల మొత్తబడి కాలు దిగబడిపోతుంది. పొలంలో నడుస్తూ ఉంటే బుడగల రూపంలో గాలి బయటికి వస్తోంది. నేల నుంచి దుర్గంధం వస్తోంది. వేర్లను తీస్తే నల్లగా ఉంటాయి.

నివారణ..

మొక్కల వేర్లకు తగినంత గాలి అందేలా చూడాలి. మురుగు నీటిని బయటికి పంపి కొత్త నీటిని పెట్టాలి. అమోనియం సల్ఫేట్ (21 శాతం నత్రజని 25 శాతం గంధకం ఉన్న ఎరువు) ఎరువులను పంటకు వాడకూడదు.

పంటకు వ్యాపించే పురుగులు..

నారుమడి నుంచి అంకురం వరకు కాండం తొలిచే పురుగు ఆశిస్తుంది. పిలక దశలో ఈ పురుగు ఆశిస్తే మొవ్వలు ఎండి చనిపోతాయి. పంట చిరు పొట్ట దశలో ఆశిస్తే తెల్ల కంకులు వస్తాయి. ముదురు నాడు నాటిన సమయాల్లో ఇది ఎక్కువగా ఆశిస్తోంది. నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము చొప్పున ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి. లేదా ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు 4కిలో చొప్పున చల్లి నివారించాలి.

నవోదయ దరఖాస్తుకు గడువు పెంపు

బిజినేపల్లి: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 15వ తేదీ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ పి.భాస్కర్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య రావడం వల్ల గడువు తేదీని ఈనెల 8నుంచి 15 వరకు పెంచామని పేర్కొన్నారు. అలాగే వివరాలు సరి చేసుకునేందుకు ఈనెల 16, 17వ తేదీల్లో అవకాశం ఉంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

కోస్గి: పొలానికి నీరుపెట్టేందుకు మోటార్ ఆన్ చేసే క్రమంలో ఓ రైతు విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాయప్ప తమ వ్యవసాయ పొలంలో బోరుమోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగిలి దూరంగా ఎగిరిపడ్డాడు. చుట్టు పక్కల కొందరు రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని ప్రైవేట్ వాహనంలో కోస్గి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పరిశ్రమపై పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు



హైదరాబాద్ వెళ్తున్న గుండేడ్ గ్రామస్తులు

బాలానగర్: మండలంలోని గుండేడ్ గ్రామ శివారులో మహవీర్ పరిశ్రమ నుంచి వెదజల్లే కాలుష్యంతో గ్రామాన్ని వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని మంగళవారం హైదరాబాద్‌లోని పొల్యూషన్ బోర్డులో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మందికిపైగా గ్రామస్తులు హైదరాబాద్‌లోని పొల్యూషన్ బోర్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు గ్రామసర్పంచ్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మహవీర్ పరిశ్రమలో కాలుష్య నియంత్రణ కోసం ఎలాంటి పరికరాలు ఉపయోగించకుండా పరిశ్రమను నడిపిస్తూ గ్రామస్తుల అనారోగ్యానికి కారణం అవుతున్నారని, ఇలాంటి పరిశ్రమ ఒక్క గంట కూడా గ్రామంలో ఉండడానికి వీల్లేదని గ్రామస్తులంతా తీర్మానం చేశారు. ఈ మేరకు ఆ ఫిర్యాదును పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, డిప్యూటీ సర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు నర్సింలు, సంతోష, శ్రీశైలం, చెన్నకేశవులు, గ్రామ పెద్దలు చెన్నరెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, పవన్, నర్సింహారెడ్డితోపాటు యువకులు ఉన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

దేవరకద్ర/ దేవరకద్ర రూరల్: స్థానిక పీహెచ్‌సీని మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌క్యూఏఎస్) కేంద్ర బృందం పరిశీలించింది. రెండురోజులపాటు జరిగిన పరిశీలనలో పీహెచ్‌సీ పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య సేవలతోపాటు ఆస్పత్రిలో వైద్య, మౌలిక సదుపాయాలు, రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరాతీశారు. అలాగే ఆస్పత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సబ్ సెంటర్ పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, వాటి పనితీరుకు సంబంధించిన పూర్తి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర సభ్యులు తనిఖీ చేసిన ఆస్పత్రిలో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని బృందం సభ్యులు భావిస్తే అవార్డులను అందజేస్తారు. నగదు ప్రోత్సాహకం, ఆస్పత్రికి కావాల్సిన పరికరాలు, కొత్త పథకాలకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించడంతో ప్రాధాన్యత ఇస్తారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు వాసంతి, నజీయా సాహిన్, డీఎంహెచ్ఓ కృష్ణ, వైద్యులు శరత్‌చంద్ర, సుస్మిత, సీహెచ్ఓ పరంకుశం, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'ప్రతిభ'



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఆ మేరకు కళాశాల విద్యార్థులు తనుశ్రీ 98.89, పూజిత 96.32, సాత్విక్‌రెడ్డి 94.37, శృతి 94.31, స్పందన 94.29, సుప్రతి 93.31, బాబారెడ్డి 93.10, యశ్వంత్‌చారి 92.47, షాహెద్ అజీం 92.46, నందిని 92.09, ఆకాష్‌నాయక్ 92.05, అఫ్రోజ్ 90.56, నిఖిలేష్ కుమార్ 90.36, అజారుహుస్సేన్ 90.16 శాతం సాధించారు.ఈ మేరకు విద్యార్థులు కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కళాశాల డైరెక్టర్స్ మంజులాదేవి, లక్ష్మారెడ్డి, విష్ణుజనార్దన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి అభినందించారు.

సత్తా చాటిన 'రిషి' విద్యార్థులు



ర్యాంకులు సాధించిన రిషి కళాశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు శ్రీనివాస్ 98.71, మహేష్ 97.98, రాఘవ ప్రియ 97.77, దినేష్ 97.70, కౌశల్ యాదవ్ 97.16, వరప్రసాద్ 96.87, యం. అభినవ్ 94.99, హుస్సేన్ 93.94, బాలవర్ధన్ 93.77, రామ్‌చరన్ 93.27 భవిత 93.17, అమర్‌నాథ్ 92.73, రిషితప్రియ 92.47, నయాన 90.75 శాతం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం చంద్రకళ, సలహాదారు వెంకటయ్య, డీస్ భూపాల్‌రెడ్డి అభినందించారు.

వాగ్దేవి విద్యార్థుల జయకేతనం



జేఈఈలో సత్తా చాటిన వాగ్దేవి విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్‌లోని వాగ్దేవి కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ మేరకు కళాశాల విద్యార్థులు నిఖిల్, నిరూద్, కౌషిక్, సింధురెడ్డి, మధుర్, దీపక్‌పవార్, విశ్వనాథం, అక్షర్ తదితరులు 90కి పైగా శాతం సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

'శ్రద్ధ' విద్యార్థుల విజయదుందుభి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని శ్రద్ధ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. కళాశాల విద్యార్థులు వెంకట్రాములు గౌడ్ 94, తిరుమలేష్ 92, ఓమర్ 90, శివకుమార్ 90, శ్రావణి 90, మహ్మది 88శాతం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ జగపతిరావు, యాజమాన్యం మధుమోహన్ తదితరులు విద్యార్థులను అభినందిచారు.

పాలమూరులో కలకలం!

కత్తులతో తండ్రి, కొడుకుపై దాడి

- ఇరువురికి తీవ్రగాయాలు, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు
- దాడి చేసిన వ్యక్తులు క్షణాల్లో పరారీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ కె.నరసింహ



గాయపడిన తండ్రి



గాయపడిన కొడుకు

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తండ్రి కొడుకును వెంటాడిన గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటన ఒక్కసారిగా జిల్లాకేంద్రంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌లోని శ్రీనివాస కాలనీకి చెందిన మహ్మద్ హబీబ్ రహమాన్ అతని కొడుకు అబ్దుల్ రహమాన్ ఇద్దరూ కలిసి మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో సత్యం చౌరస్తాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డయాబెటిక్‌కు సంబంధించిన వైద్యం చేయించుకుని ద్విచక్రవాహనంపై బయల్దేరారు. బాయమ్మతోట నుంచి గీతా హోటల్ వైపు వెళ్లే మలుపు దగ్గర వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మరో ద్విచక్రవాహనంపై వచ్చి మొదట తండ్రి మహ్మద్ హబీబ్ రహమాన్‌పై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. అతడి శరీరంపై దాదాపు 15 కత్తి పోట్లు పడ్డాయి. ఆ తర్వాత అడ్డుగా వచ్చిన కొడుకు అబ్దుల్ రహమాన్‌పై కూడా దాడి చేయడంతో ఆయనకు అతడికి దాదాపు ఐదు నుంచి ఆరు కత్తిపోట్లుతో పాటు చెయ్యి వేళ్లు తెగిపడ్డాయి. దాడి చేసిన వ్యక్తులు అక్కడి నుంచి క్షణాల్లో పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన తండ్రి, కొడుకును చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్పీ కె.నరసింహ, డీఎస్పీ మహేష్, టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి తండ్రి, కొడుకును పరిశీలించారు. అనంతరం సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి ఎస్పీ వివరాలు సేకరించారు. దాడి చేసింది ఎవరూ అనే విషయం తెలియదని.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. దాడికి కారణం మహబూబ్‌నగర్–అల్లీపూర్ మధ్యలో ఉన్న ఓ భూమికి సంబంధించిన వ్యవహారమే కారణమని తెలుస్తోంది. పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్‌కు తరలించారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటా విడుదల



తిరుమల: వివిధ రకాల ఆర్జిత సేవా టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు టీటీడీ విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆన్‌లైన్ ఆర్జిత సేవలైన (వర్చువల్ పార్టిసిపేషన్) కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్ల కోటాతోపాటు, ఈ సేవల ద్వారా లభించే దర్శన కోటాను ఫిబ్రవరి 9న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎలక్ట్రానిక్ డిప్ పద్ధతిలో ఆర్జిత సేవా టికెట్ల నమోదు కోసం 8న ఉదయం 10 గంటల నుంచి ఫిబ్రవరి 10న ఉదయం 10 గంటల వరకు అవకాశం ఉంటుంది. ఇతర ఆర్జిత సేవా టికెట్లను 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. https://tirupatibalaji.ap.gov.in ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య



రవిచరణ్(ఫైల్)

చెన్నారావుపేట: తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన ఓ బాలుడు ఉరేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలకేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. చెన్నారావుపేటకు చెందిన వీరమల్లు, రేణుక దంపతులకు రవిచరణ్(13), రవళి సంతానం. రవిచరణ్ చెన్నారావుపేట హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. వీరమల్లు నీరడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అనారోగ్యంతో ఉన్న రేణుక చికిత్స నిమిత్తం రెండ్రోజుల క్రితం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లింది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లాలని రవిచరణ్‌ను తండ్రి మందలించి తన పనికి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన కుమారుడు ఇంట్లో ఉరేసుకున్నాడు. రవళి గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అతడిని చికిత్స కోసం నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వీరమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు.

లక్షన్నర కోట్లు.. లక్షకుపైగా జాబ్స్

ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు 'ఎస్‌ఐపీబీ'గ్రీన్ సిగ్నల్

- ప్రత్యక్షంగా 1,03,075 మందికి ఉపాధి.. పరోక్షంగా మరిన్ని
- పలు భారీ పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం



సాక్షి, అమరావతి: ఏపీలో రూ.1,44,185.07 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తద్వారా కొత్తగా 1,03,075 మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందనుండగా పరోక్షంగా మరింత మందికి ఉపాధి లభ్యం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ అనకాపల్లి జిల్లాలో రూ.1.10 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పే న్యూ ఎనర్జీ పార్కుతోపాటు కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు, పలు రంగాల్లో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. పరిశ్రమలు స్థాపించే వారికి చేదోడుగా నిలవాలని ఈ సందర్భంగా అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తై కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ప్రతి పరిశ్రమలో ప్రభుత్వం రూపొందించిన చట్టం ప్రకారం 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కాలని మరోసారి స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ప్రాజెక్టుల విధానంలో కీలక మార్పులు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికే ఆదాయం వచ్చే పరిస్థితులు తీసుకొచ్చామన్నారు. విద్యుత్ ప్రాజెక్టుల కోసం తీసుకుంటున్న భూమికి ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు కింద చెల్లింపులు చేస్తారని, దీనివల్ల కరువు ప్రాంతాల్లో రైతులకు మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి మెగావాట్‌కు లక్ష రూపాయల చొప్పున రాష్ట్రానికి కంపెనీలు చెల్లిస్తున్నాయని తెలిపారు. ఎస్‌జీఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి రెవెన్యూ వస్తుందన్నారు. గ్రిడ్ బాధ్యతలు కూడా రాష్ట్రానికి లేవన్నారు. దీంతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. భోగాపురంలో అత్యంత అధునాతన సదుపాయాలతో ఐటీ పార్కు ఏర్పాటు కావాలని సీఎం జగన్ ఆదేశించారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎస్‌ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదనలు ఇవీ

- ఎన్టీపీసీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద న్యూ ఎనర్జీ పార్కు ఏర్పాటు కానుంది. మొదటి విడతలో రూ.55 వేల కోట్లు, రెండో విడతలో మరో రూ.55 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మొత్తంగా రూ.1,10,000 కోట్ల పెట్టుబడులతో తొలిదశలో 30 వేల మందికి, రెండో దశలో 31 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. మొత్తంగా 61 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తారు.
- కడియం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ విస్తరణ ప్రాజెక్టు ద్వారా మొత్తంగా రూ.3,400 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. 2025 నాటికి దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- శ్రీకాళహస్తి, పుంగనూరులో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ ఫ్యాక్టరీల స్థాపన ద్వారా డీఐ పైపులు, ఫెర్రో అల్లాయిస్ తయారీ. శ్రీకాళహస్తిలో రూ.915.43 కోట్లు, పుంగనూరులో రూ.171.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. మొత్తంగా రూ.1,087 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ప్రత్యక్షంగా 2,350 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు. ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వీటిని ఏర్పాటు చేస్తుంది. నాలుగు విడతల్లో మొత్తం రూ.10,500 కోట్ల పెట్టుబడుల ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- రామాయపట్నంలో అకార్డ్ గ్రూప్ రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కాపర్ కాథోడ్, కాపర్ రాడ్, సల్ఫూరిక్ యాసిడ్, సెలీనియం, ప్రత్యేక ఖనిజాల తయారీ ద్వారా ప్రత్యక్షంగా 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1489.23 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తిరుపతిలో నెలకొల్పే పరిశ్రమ ద్వారా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- కృష్ణా జిల్లా మల్లవల్లి పార్కులో ఇథనాల్ ఇంధన తయారీకి అవిశా, ఫ్యూయెల్స్ కంపెనీ ముందుకొచ్చాయి. మొత్తంగా రూ.498.84 కోట్ల పెట్టుబడి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,300 మందికి ఉపాధి లభిస్తుంది.
- విశాఖపట్నంలోని కాపులుప్పాడలో మరో 100 మెగావాట్ల డేటా సెంటర్‌ను వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోంది. మొత్తం రూ.7,210 కోట్ల పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 14,825 మందికి, పరోక్షంగా 5,625 మందికి.. మొత్తంగా 20,450 మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఏర్పాటు చేస్తున్న 200 మెగావాట్ల డేటా పార్కుకి ఇది అదనం.
- భోగాపురంలో 90 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్కు ఏర్పాటుకు ఎస్‌ఐపీబీ ఆమోదం లభించింది.
- రాష్ట్రంలో బాక్సైట్ తవ్వకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ తమ ప్రణాళికలను మార్చుకుంది. ఫ్యాక్టరీ కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించిన 985 ఎకరాల భూమిలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఎస్‌ఐపీబీ ఆమోదించింది.

సీబీఐ దర్యాప్తుపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకోండి అని వినతి
- డివిజన్ బెంచ్ ఆదేశాలపై సింగిల్ జడ్జి స్టే ఇవ్వలేరన్న పిటిషనర్ న్యాయవాదులు
- సీజే నుంచి స్పష్టత తీసుకోవాలని ఏజీని ఆదేశించిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే వరకు ఆ తీర్పు అమలును నిలిపివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ దర్యాప్తు చేయాలంటూ ఇచ్చిన తీర్పును మూడు వారాలపాటు నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్ మంగళవారం ఈ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, సీబీఐ దర్యాప్తు తీర్పును వారం రోజులైనా నిలిపివేయాలని కోరారు. సుప్రీంకోర్టును ఆశ్రయించే వరకు (పిటిషన్‌ను విచారణకు స్వీకరించే వరకు) స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సింగిల్ జడ్జి తీర్పుపై ద్విసభ్య ధర్మాసనం మెరిట్స్‌లోకి వెళ్లలేదు కాబట్టి తమ లంచ్‌మోషన్ పిటిషన్‌లో సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ప్రశ్నకు ఏజీ సమాధానమిచ్చారు. సీబీఐ దర్యాప్తును నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వొచ్చని చెప్పారు. ప్రస్తుతం సిట్ విచారణ నిలిచిపోయిందని, ఈ పరిస్థితుల్లో సీబీఐ దర్యాప్తు చేసేందుకు అత్యుత్సాహం చూపడం సరికాదన్నారు. ఇప్పటికే సీబీఐ జేడీ ఫైళ్లు అప్పగించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారని, సీబీఐ అత్యుత్సాహాన్ని పరిగణనలోకి తీసుకుని స్టే ఇవ్వాలని కోరారు.

నేటి మధ్యాహ్నానికి వాయిదా..

ఈ కేసులో డివిజన్ బెంచ్ స్టే ఇచ్చిందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, సింగిల్ జడ్జి తీర్పు తర్వాత దర్యాప్తు కోసం సీబీఐ ప్రభుత్వంపై ఒత్తిడి చేయొద్దని ఉత్తర్వుల్లో స్పష్టంచేసిందని ఏజీ బదులిచ్చారు. ద్విసభ్య ధర్మాసనం అప్పీల్లోని మెరిట్స్ ఆధారంగా తుది ఉత్తర్వులు ఇవ్వలేదని, అప్పీల్‌కు విచారణార్హత లేదని తేల్చినందున సింగిల్ జడ్జి జోక్యం చేసుకోవచ్చన్నారు. నిందితుల తరపు సీనియర్ న్యాయవాదులు రవిచందర్, ప్రభాకర్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పాక స్టే కోసం సింగిల్ జడ్జి వద్దకు ప్రభుత్వం రావడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని, సింగిల్ జడ్జి స్టే ఇవ్వడానికి ఆస్కారం లేదని వాదించారు. సింగిల్ జడ్జి తీర్పుపై సీజే బెంచ్ వద్ద అప్పీల్ దాఖలు చేస్తే తీర్పు వచ్చిందని, ఇప్పుడు మళ్లీ అదే సింగిల్ జడ్జి వద్దకు స్టే కోసం ఎలా వస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేవరకు ఆదేశాలను నిలుపుదల చేయడానికి ద్విసభ్య ధర్మాసనం నిరాకరించిందని గుర్తుచేశారు. సిట్ దర్యాప్తు చేయాలని భావించడమూ అత్యుత్సాహం కిందకే వస్తుందని చెప్పారు. వాదనలు విన్న తర్వాత జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి.. ద్విసభ్య ధర్మాసనం తీర్పు తర్వాత స్టే కోసం సింగిల్ జడ్జిని ఆశ్రయించవచ్చో లేదో చీఫ్ జస్టిస్ నుంచి స్పష్టత తీసుకుని చెప్పాలని ఏజీని ఆదేశించారు. బుధవారం సీజే బెంచ్ వద్ద స్పష్టత తీసుకుని చెబుతామని ఏజీ చెప్పడంతో విచారణను బుధవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి చెప్పారు.

ఎమ్మెల్యేల ఎర కేసులోకి సీబీఐని రానీయొద్దు

- పిటిషన్‌ను త్వరగా విచారించాలి
- సీజేఐ ముందు ప్రస్తావించిన తెలంగాణ తరపు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఎమ్మెల్యేల ఎర కేసు దర్యాప్తులోకి సీబీఐని రానీయొద్దని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ప్రస్తావించారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను త్వరగా విచారించాలని అభ్యర్థించారు. సీబీఐ దర్యాప్తు చేస్తే కేసు నీరుగారిపోతుందని చెప్పారు. అనంతరం, ఇదే విషయాన్ని బుధవారం మెన్షన్‌లో ప్రస్తావించాలని సీజేఐ సూచించారు. 'వచ్చే వారంలో విచారణ జాబితాలో చేర్చుతాం. మరోసారి బుధవారం ప్రస్తావించండి' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు.

ఈవీఎంల వద్ద భద్రత కట్టుదిట్టం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత, సిబ్బంది హాజరు ఎప్పటిలాగే కొనసాగించాలని, ఇక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టర్ జిల్లాకేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు బందోబస్తు, గోదాం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సీతారామారావు, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ పార్థసారథి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చైతన్య, జాఫర్ తదితరులు ఉన్నారు.

పీయూ క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ గద్వాల: పాలమూరు యూనివర్సిటీ పురుషుల క్రికెట్ జట్టును గద్వాల స్టేడియంలో మంగళవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలకు చెందిన 35 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన 22 మందితో ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక శిబిరం నిర్వహించి 16 మందితో కూడిన తుది జట్టును ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి మార్చి 4వ తేదీ వరకు బెంగళూర్‌లోని రేవా యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పీడీ బాల్‌రాజు తెలిపారు. గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ హాజరు కాగా.. ఎంపికలను కోచ్ శ్రీనివాసులు, స్టేడియం ఇన్‌చార్జ్ జితేందర్, పీఈటీ ప్రభాకర్, ఆనంద్, హరిబాబు, తదితరులు పర్యవేక్షించారు.



జర్నలిస్టుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి



సమావేశంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కందనూలు: సమాజ హితం కోసం నిరంతరం పాటుపడుతూ.. ప్రజలను చైతన్యం చేస్తున్న వీరులు జర్నలిస్టులు అని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అలాంటి జర్నలిస్టుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టీయూడబ్ల్యూజే-143 ద్వితీయ వార్షికోత్సవ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రితోపాటు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జిల్లా ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణే అన్నారు. చాలామంది జర్నలిస్టులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతారని, సీఎం కేసీఆర్ సూచన మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. అల్లం నారాయణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఖమ్మం జిల్లాలో చెప్పినట్లుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జెడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడతారని కొనియాడారు. జిల్లా ఎమ్మెల్యేలు మర్రి, గువ్వల, బీరం, జైపాల్‌యాదవ్‌లు మాట్లాడుతూ జర్నలిస్టుల అభ్యున్నతి కోసం తమవంతుగా సహకారం అందిస్తామని చెప్పారు. తమ నియోజకవర్గాల్లోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సత్వరమే చర్యలు చేపడుతామన్నారు. ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ పోరాట పటిమే జర్నలిస్టుల ఆయుధం అని కొనియాడారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ తమ పాటలతో అలరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి మారుతిసాగర్, డీసీసీబీ డైరెక్టర్ రఘునందన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, యోగి, వెంకటయ్య, రాజేష్‌గౌడ్, పాల్గొన్నారు. అంతకు ముందు ఉయ్యాలవాడ సమీపంలో జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణాల కోసం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

- అలంపూర్‌లో మహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

జోగుళాంబ శక్తిపీఠం: శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అబ్రహం, ఆర్డీఓ రాములు అన్నారు. మంగళవారం అలంపూర్‌లోని దక్షిణకాశి భవన్‌లో మహాశివరాత్రి ఉత్సవాలపై ఈఓ పురేందర్‌కుమార్, దేవస్థానం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ మినహా అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆర్డీఓ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 21 వరకు అయిదురోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఎంత మంది భక్తులు వస్తారు.. ఏయే రోజులు ప్రాముఖ్యత అనే అంశాలను తెలియజేశారు. ఏయే శాఖలు ఎలాంటి సహకారం అందించాలో వివరించారు. ఆర్టీసీ, పారిశుద్ధ్యం, విద్యుత్, ఆరోగ్య, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం సేవలు ఎంతో అవసరం అన్నారు. గతంలో ఎదురైన సమస్యలను గుర్తించుకుని అవి మళ్లీ పునరావృతతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. దేవస్థానం తరఫున చేపట్టే కార్యక్రమాలు, వసతి సౌకర్యాలను ఆలయ ఈఓ అధికారులకు తెలియజేశారు.

ఖర్చుల వివరాలు చెప్పండి

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు, భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం గతంలో ఎంత ఖర్చు చేసింది.. ఇప్పుడు ఎంత కేటాయిస్తున్నారో వివరాలు చెప్పాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో ఈఓ స్పందిస్తూ రికార్డులు చూసి చెబుతానని సమాధానం ఇచ్చారు. ఆలయం నుంచి చేసే ఖర్చులు ప్రజలకు, భక్తులకు సమాధానం చెప్పాలని సూచించారు. ఎంత ఖర్చు పెడతారో మాకు తెలియనిది మేం ఏయే సౌకర్యాలు కల్పించాలో మీకు ఎలా చెబుతామంటూ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మహాశివరాత్రి వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనోరమ, సీఐ సూర్యనాయక్, ఎస్‌ఐ మహేందర్, ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్, జూనియర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, రికార్డు అసిస్టెంట్ ప్రదీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంకొండలో ద్వితీయ ప్రభోత్సవం



అశ్వవాహనంపై అలంకరణలో స్వామివారు



మన్యంకొండలో స్వామివారి సుదర్శన పెరుమాళ్లను పల్లకీలో తీసుకెళ్తున్న అర్చకులు



అళహరి రామయ్య చిత్రపటానికి పూజలు చేస్తున్న అళహరి వంశీయులు రామకృష్ణ

- అశ్వవాహనంపై తేరు మైదానానికి స్వామివారు
- సుదర్శన పేరుమాళ్లకు భక్తుల పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి స్వామివారి ద్వితీయ ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని గర్భగుడి ముందున్న సేవా మండపంలో అశ్వవాహనంపై ఉంచి దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అశ్వవాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి మెట్ల మార్గం గుండా తేరు మైదానానికి తీసుకువచ్చారు.

ఘనంగా వసంతోత్సవం..

మంగళవారం స్వామివారి వసంతోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలోని హనుమద్దాసు మండపంలో అళహరి వంశానికి చెందిన అళహరి రామయ్యకు అదే వంశానికి చెందిన అళహరి రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న రైల్వే ఏజీఎం



రైల్వే ఏజీఎంకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారి



టీజీ వెంకటేష్‌ను కలిసిన ఈఓ , చైర్మన్

అలంపురం: ఇక్కడి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఏజీఎం ఉదయ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ పురేందర్ కుమార్ సాదర స్వాగతం పలికారు. అదేవిధంగా యూనివర్సిటీ ఆఫ్ కేరళ వైస్ చాన్సలర్ డాక్టర్ వీపీ మహేంద్రవన్ పిళ్లై దర్శించుకున్నారు. అలాగే కర్నూలు జిల్లాలోని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను ఆలయ ఈఓ పురేందర్, చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కలిశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈఓ, చైర్మన్ టీజీ వెంకటేష్‌తో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని బ్రాహ్మణకొట్కూరు దగ్గర జోగుళాంబ దేవస్థానంకు సంబంధించిన ఆర్చిగేట్ (స్వాగత తోరణం) నిర్మించాలని కోరారు. ఈ మధ్యకాలంలో అలంపురం తుంగభద్ర నదిపై బ్రిడ్జి నిర్మాణం అయిందని ఈ బ్రిడ్జి మీదుగా కర్నూలు జిల్లాలోని బ్రాహ్మణకొట్కూరు వెళితే అక్కడి నుంచి శ్రీశైలం చాలా దగ్గర అవుతుందని తెలిపారు. కాబట్టి భక్తయాత్రికులు అటు అలంపూర్ ఇటు శ్రీశైలం మార్గం వెళ్లే దారిని గుర్తించేందుకు బ్రాహ్మణ కొట్కూరు కూడలిలో ఆర్చి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కేంద్ర పురాతత్వ శాఖ అధికారులతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు.